# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 24, జులై 2026




జ్యోతిరావు పూలే పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కలకలం..

# 15 మంది విద్యార్థులకు అస్వస్థత

## ఆస్పత్రిలో చికిత్స, పలువురు కోలుకున్నారు

బెల్లంపల్లి, జూలై 23, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అనుమానంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన కలకలం రేపింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, బుధవారం రాత్రి వడ్డించిన ఆలూ బిర్యాని తిన్న అనంతరం కొంతమంది విద్యార్థినులకు వాంతులు, అస్వస్థత లక్షణాలు కనిపించాయి. దీంతో దాదాపు 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో 11 మంది విద్యార్థినులను బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అనంతరం మరికొంత మందిని కూడా చేర్పించారు. భోజనం చేసిన తర్వాత నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా వాంతులు రావడంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు పాఠశాల పరిసరాల్లో ఉన్న అపరిశుభ్రత కారణమై ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల ప్రహరీ పక్కన దుర్గంధం వెదజల్లుతున్న మురికి గుంట ఉండటం, పరిసరాల్లో శుభ్రత లోపించడం ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా వైద్యాధికారి మిగతా 2లో..



# కనీస వసతులే కరువు...

- డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నరకయాతన
- రోడ్లు, తాగునీరు, పారిశుద్ధం లేక అవస్థలు...
- పాములు, దోమల మధ్య బిక్కుబిక్కుమంటున్న లబ్ధిదారులు



మందమర్రి, జులై 23, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ గృహాలను లబ్ధిదారులకు కేటాయించి దాదాపు రెండేళ్లు గడిచినా, ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధం వంటి ప్రాథమిక అవసరాలు అందక నిత్యం అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి సరైన రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారి నడవడమే కష్టంగా మారిందని, ద్విచక్ర వాహనాలు మిగతా 2లో..

భద్రతకు భరోసా...

# నిఘా కవచంగా నిఘా నేత్రాలు



* నేరాల నియంత్రణకు ప్రతి వ్యాపార సంస్థలో నిఘా కెమెరాలు తప్పనిసరి

* నగల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మంచిర్యాల డిప్యూటీ పోలీసు కమిషనర్ భాస్కర్

- మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త

2 లో..

# జలసిరితో భూగర్భ జలాలు పెంచుదాం

## ప్రతి రైతు ఫామ్ పాండ్ నిర్మించుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జులై 23, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమం భూగర్భ జలాల సంరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో ఫామ్ పాండ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరల వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రత్యేకంగా భూమిపూజ నిర్వహించారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. వారి వ్యవసాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం మిగతా 2లో..



# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో శతశాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, జూలై 23, ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఉపపాలనాధికారి జాస్తిన్ జోన్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ లు మెంగ్రే ఆకాష్, పహీమ్ సుల్తానా, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్ లతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై మున్సిపల్ చైర్మన్, వైఫ్ చైర్మన్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 85.94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి అయిందని, మిగిలిన మిగతా 2లో..



### జ్యోతిరావు పూలే పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కలకలం..

## 15 మంది విద్యార్థులకు అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

నరేందర్ రాథోడ్, ఎంజేపీ ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్. శ్రీధర్, బెల్లంపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్. శ్రీధర్ మాట్లాడుతూ, 15 మంది విద్యార్థుల్లో 7 మంది పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. మిగతా 8 మంది విద్యార్థులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. ఇది ఫుడ్ పాయిజన్ కాదని, కొందరికి ఇన్‌ఫెక్షన్ సమస్య తలెత్తినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ముందుజాగ్రత్త చర్యగా వారిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అనంతరం అధికారులు పట్టణంలోని శంషీర్ నగర్‌లో ఉన్న ఎంజేపీ పాఠశాలను కూడా పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో ఉన్న దుర్గంధం, అపరిశుభ్రతను గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. ఈ ఘటన నేపథ్యంలో పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## కనీస వసతులే కరువు...

(మొదటిపేజీ తరువాయి)

జారి ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని, ముఖ్యంగా మొదటి, రెండో అంతస్తుల్లో నివసించే కుటుంబాలకు నీరు సరిగా అందడం లేదని వాపోయారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ గృహాల వద్దకు వచ్చిన కొందరు నాయకులు రోడ్లు, మంచినీటి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి వెళ్లిపోయారని, కానీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని కాలనీవాసులు ఆరోపించారు. కాలనీ పరిసరాల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పాములు, క్రిమికీటకాలు, పందులకు ఆవాసంగా మారిందని తెలిపారు. వర్షాకాలంలో పాములు ఇళ్లలోకి వస్తుండటంతో చిన్నపిల్లలను బయటకు పంపాలన్నా భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమలు, ఈగల బెడదతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. కనీస వసతులు కూడా లేని ఇళ్లను నిరుపేదలకు ఎందుకు కేటాయించారని అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని మందమర్రి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## భద్రతకు భరోసా... నిఘా కవచంగా నిఘా నేత్రాలు

**మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త**

ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, నేరాల నియంత్రణకు ప్రతి వ్యాపార సంస్థలో నిఘా కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరమని మంచిర్యాల డిప్యూటీ పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్ స్పష్టం చేశారు. గురువారం మంచిర్యాల పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా నగల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులకు నిఘా కెమెరాల ప్రాధాన్యత, భద్రతా చర్యలు, నేరాల నివారణపై అవగాహన కల్పించారు. మంచిర్యాల నగరం పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ పోలీసు కమిషనర్ పేర్కొన్నారు. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉండటం, రైల్వే మార్గం ద్వారా భారీగా ప్రజల రాకపోకలు సాగుతుండటంతో అప్రమత్తత అత్యవసరమని తెలిపారు. తెలంగాణ ప్రజా భద్రత అమలు చట్టం ప్రకారం వ్యాపార సంస్థలు, బ్యాంకులు, హోటళ్లు, లాడ్జీలు, నివాస సముదాయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో నాణ్యమైన నిఘా కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. భవనం లోపల, ముందు, వెనుక భాగాలతో పాటు రహదారులపై జరిగే కదలికలు స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా కెమెరాలను అమర్చాలని తెలిపారు. దీనివల్ల నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందన్నారు.

ఇటీవలి కాలంలో నేరస్తులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఆయుధ దళాలతో పగలు, రాత్రి నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచిర్యాలతో పాటు నస్పూర్, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో ఇరవై నాలుగు గంటలపాటు గస్తీ కొనసాగుతోందని, జాతీయ రహదారులపైనా నిఘాను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని, తమ వ్యాపార సంస్థలు, నివాసాలు, వాణిజ్య సముదాయాల్లో నాణ్యమైన నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నివారణలో భాగస్వాములు కావాలని డిప్యూటీ పోలీసు కమిషనర్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సహాయ పోలీసు కమిషనర్ ప్రకాష్, పోలీసు ఇన్స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఉప పోలీసు పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరితో భూగర్భ జలాలు పెంచుదాం

(మొదటిపేజీ తరువాయి)

తక్కువగా నమోదవుతోందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఫామ్ పాండ్ల వంటి నీటి నిల్వ నిర్మాణాలు అత్యవసర సమయంలో పంటలకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఫామ్ పాండ్ ల నిర్మాణం వల్ల వర్షపు నీరు ఇంకి భూగర్భ జలమట్టం పెరుగుతుందన్నారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్, అధికారులు, రైతులతో కలిసి తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఓ విజయలక్ష్మి, కుబీర్ తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, దోడర్న సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో శతశాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

14 శాతం పూర్తి చేసి 100 శాతం అయ్యేలా రాజకీయ పార్టీలు, మున్సిపాలిటీల పాలకవర్గాలు సహకరించాలని తెలిపారు. కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలలో ఇంకా చాలా మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలని, ఫారాలు బూత్ స్థాయి అధికారులకు అందించని పక్షంలో వారు ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఫారాలు అందించని వారి జాబితా అందించడం జరుగుతుందని, వారిని గుర్తించి ఫారాలు అందించేలా రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ, ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో సిద్ధం చేయడం జరుగుతుందని, మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారి జాబితాను సైతం సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువుకు ముందే 100 డిజిటలైజేషన్ అయ్యేలా రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు

**మందమర్రి, జులై 23, ప్రభాతవార్త**



తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ నాయకుడు మహంత్ అర్జున్ కుమార్ ఆధ్వర్యంలో మందమర్రిలోని మనోవికాస్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహంత్ అర్జున్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మీనాక్షి నటరాజన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై స్పందిస్తూ, బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాకం రవి, ఒరగంటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరుబాట పట్టాలి

**- ఆగస్టు పదో తేదీ జైల్ భరో విజయవంతం చేయాలని పిలుపు**

**- కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని జిల్లా సదస్సులో నేతల పిలుపు**

**మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలో గురువారం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాల మార్పులు, వ్యవసాయ రంగంలో దిగుమతి విధానాలు, ఉపాధి హామీ పథకం, విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న మార్పులు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు పదో తేదీన నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పైళ్ల ఆశయ్యతో పాటు దుంపల రంజిత్ కుమార్, గోమాస ప్రకాష్, బోడెంకి చందు, కనికరపు అశోక్, ఎర్మ పున్నం తదితరులు పాల్గొన్నారు.

## జీఎంను కలిసిన ఎస్‌బీఐ యాపల్ శాఖ నూతన మేనేజర్

**మందమర్రి, జులై 23, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాపల్ శాఖ నూతన బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. కళారామన్ గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఎన్. రాధాకృష్ణకి బి. కళారామన్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు మరియు మందమర్రి ఏరియాలోని యాపల్ ఎస్‌బీఐ శాఖకు ఎన్నో సంవత్సరాలుగా విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కార్పొరేట్ స్థాయి నుంచి బ్యాంకు యాజమాన్యంతో కొనసాగుతున్న సుహృద్భావ సంబంధాల వల్ల సింగరేణి కార్మికులకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. ఇదే స్నేహపూర్వక వాతావరణం భవిష్యత్తులో కూడా కొనసాగాలని, సంస్థకు మరియు కార్మికులకు బ్యాంకు సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో బతుకుల కోసం ఐక్య పోరాటానికి శ్రీకారం

**- మంచిర్యాలలో అన్ని ఆటో సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం**

**- ప్రభుత్వానికి కీలక డిమాండ్లు, సమస్యలు పరిష్కరించకుంటే ఉమ్మడి ఉద్యమం హెచ్చరిక**

**మంచిర్యాల, జులై 23 ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లాలోని వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొని ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించారు. మహాలక్ష్మి పథకం అమలు అనంతరం ఆటోలకు గిరాకీ తగ్గడంతో పాటు రాపిడో సేవల వల్ల వేలాది మంది డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాపిడో సేవలను అరికట్టేందుకు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని, అవసరమైతే జిల్లా వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని తీర్మానించారు. ఆటో కార్పొరేషన్ ఏర్పాటు, ఆటో సంక్షేమ బోర్డు, నెలకు పదిహేను వేల రూపాయల జీవన భృతి, యాభై ఏళ్లు దాటిన డ్రైవర్లకు పెన్షన్, ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య సదుపాయం, ఆటోలకు సంబంధించిన ప్రభుత్వ రుసుములను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే అన్ని ఆటో సంఘాలతో కలిసి ఉమ్మడి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## వైభవోపేతంగా మైసమ్మ తల్లి బోనాల జాతర

**నస్పూర్, జులై 23, ప్రభాతవార్త**

మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సీసీసీ రాయల్ టాకీస్ వద్ద నిర్వహించే వార సంత వ్యాపారస్తుల అన్నపూర్ణ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ మైసమ్మ తల్లి బోనాల జాతర అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకకు టీపీసీసీ సభ్యులు నూకల రమేష్‌తో కలిసి మేయర్ ధర్ని మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా భక్తులు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. వ్యాపారులకు, ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, అన్నపూర్ణ వారసంత గౌరవ అధ్యక్షులు రాచకొండ వెంకటేశ్వర్ రావు, స్థానిక వ్యాపారస్తులు, అన్నపూర్ణ సొసైటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతపై బిఆర్ఎస్వి ఆందోళన

**బెల్లంపల్లి, జూలై 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సుమారు 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై బిఆర్ఎస్వి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల ప్రాణాల విషయంలో ప్రభుత్వం, సంబంధిత శాఖల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిందని మండిపడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించిన బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థ పూర్తిగా పతనమైందని ఈ ఘటన స్పష్టంగా చెబుతోంది. గురుకుల పాఠశాలలు విద్యార్థులకు భద్రత కల్పించాల్సింది పోయి, ప్రాణహాని కలిగించే కేంద్రాలుగా మారడం దారుణం. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు నేరం అని తీవ్రంగా విమర్శించారు. ఈ ఘటనపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకులాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర తనిఖీలు నిర్వహించాలని, లేనిపక్షంలో ఇటువంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే బిఆర్ఎస్వి మౌనంగా ఉండదు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. బాధిత విద్యార్థినులకు ఉత్తమ వైద్యం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి అని బడికల శ్రావణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి పట్టణ అధ్యక్షులు ఆడెపు అరుణ్, మాజీ అధ్యక్షులు మురుకురి శ్రావణ్, పట్టణ కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, నితీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.






ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై బీఎల్ఏలకు సూచనలు అందిస్తున్న రియాజ్

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

**చింతలమానేపల్లి, జూలై 23, ప్రభాతవార్త:**

మండలంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏల)తో ఎమ్మెల్సీ దండే విఠల్ తో కలసి తెలంగాణ గ్రంథాలయ శాఖ చైర్మన్ రియాజ్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని, తప్పుల సవరణ, చిరునామాల మార్పు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొంటూ, అర్హులైన ఏ ఒక్కరూ జాబితాకు దూరం కాకుండా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డుబ్బులు నానయ్య, మాజీ జిల్లా చైర్మన్ గణపతి, మాజీ ఎంపిపి డుబ్బుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాదారంలో మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

## ఇంటింటికి మొక్కలు పంపిణీ

**తాండూర్, జూలై 23, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం, నీలాయిపల్లి, కిష్టంపేట, అచ్చలాపూర్ గ్రామపంచాయతీలలో గురువారం వనమహోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు కుషనపల్లి లక్ష్మణ్, పోలవేణి తిరుపతి, సార్ల తిరుపతి, మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచులు సూరం దామోదర్ రెడ్డి, అనుమండ్ల విక్రం, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, మాదారం ఎస్సై సౌజన్య, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు, నాయకులు పాల్గొన్నారు.

## అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఎంపిక

**ఆసిఫాబాద్, జులై 23, ప్రభాతవార్త :**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు ఒకేసారి 15 మంది విద్యార్థినులు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ విజయం విద్యార్థినుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఏఓ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, కళాశాల సిబ్బంది అభినందించి వారు ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కళాశాలలోని ఇతర విద్యార్థినులు కూడా వివిధ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షలు, విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**కెరమెరి జూలై 23 ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరివిరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు పిలుపునిచ్చారు. గురువారం కుంరం భీం ఆదివాసీ భవన్లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ఇంటి పరిసరాలలో కాలనీలలోని ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, ఈసీ ఆక్య నాయక్, పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్, ప్రకాష్, గోపి, శంకర్, రాంచందర్ తదితరులు ఉన్నారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, జూలై 23, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలోని గాంధీ నగర్ లో గురువారం సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఆకుల వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ రూ.5 లక్షల విబిజి రాంజీ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టమన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్, బెల్లంపల్లి ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్, మాదారం, నర్సాపూర్ సర్పంచులు కుశనపల్లి లక్ష్మణ్, ప్రభాత్ రావు, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డ్ మెంబర్ బాణేష్ నాయకులు పుట్ట శ్రీనివాస్, కొండగొర్ల అంజి, జోర్రిగాల రమేష్, శ్రీనివాస్, కాలనీవాసులు, దాసరి కిషోర్, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.





నిషేధిత మందుల విక్రయాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

## నిషేధిత మందులు అమ్మొద్దు, డిఏఓ వెంకట్

**- ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి**

**- ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తే చర్యలు**

**చింతలమానేపల్లి, జూలై 23, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకట్ అధ్యక్షతన, మండల వ్యవసాయ అధికారి కార్తీష పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి ఏఈఓలు, రైతులు,ఇన్‌పుట్ డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ఎంఆర్‌పి ధరలకంటే అధికంగా ఎరువులు విక్రయించడం, నిషేధిత పురుగుమందులు అమ్మడం, ఎక్స్‌పైరీ మందులు ఉంచడం నిషిద్ధమని డీలర్లను హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించి రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున, నీటి వసతి ఉన్నచోటే వరి సాగు చేయాలని, వర్షాధార ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా పప్పు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఆగస్టు 20 వరకు పత్తి, కంది, పెసరు, ఆ తర్వాత నువ్వులు, జొన్న, సజ్జ పంటలు వేసుకోవాలని తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా

**చింతలమానపల్లి, జూలై 23, ప్రభాతవార్త;**



మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనల ప్రకారం ఆ వాహన యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం. కమలాకర్ మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, మోటార్ సైకిల్ నడిపేటప్పుడు అన్ని రవాణా నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

## ఎస్ఈఎస్ ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా: ఏఐటీయూసీ

**నస్పూర్, జూలై 23, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ పరిధిలోని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎస్ఈఎస్) స్కూల్ మేనేజ్మెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా కార్పొరేట్ సాలరీ అకౌంట్ ద్వారా అందించే రూ.1 కోటి ప్రమాద బీమా వర్తించేలా సంబంధిత బ్యాంకులు అంగీకరించినట్లు గుర్తింపు సంఘం సింగరేణి వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో సంబంధిత బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఆయన కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా ప్రయోజనం అందుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం సింగరేణి స్కూల్ మేనేజ్మెంట్ ఉద్యోగుల కుటుంబాలకు గొప్ప ఆర్థిక భద్రతను, కొండంత ఉపశమనాన్ని ఇస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా, సింగరేణి సూపర్ బజార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఇదే తరహా రూ.1 కోటి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా ఏఐటీయూసీ యాజమాన్యం మరియు సంబంధిత బ్యాంకులతో చర్చలు జరుపుతోందని, త్వరలోనే సానుకూల నిర్ణయం వచ్చేలా నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. సింగరేణి సంస్థ పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సమాన సంక్షేమ సౌకర్యాలు, భద్రత మరియు ఆర్థిక రక్షణ కల్పించడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని, కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.



## అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్న బెల్లంపల్లి 19వ వార్డు

**బెల్లంపల్లి, జూలై 23, ప్రభాతవార్త**

బెల్లంపల్లి బస్తీ 19వ వార్డులో రోడ్డు పక్కన ఉన్న చెత్తకుండీ స్థానిక ప్రజల జీవితాలను నరకంగా మార్చేసింది. సంవత్సరాలుగా పేరుకుపోతున్న చెత్త, దుర్వాసన, దోమల బెడద మధ్య బతుకుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా బాధ్యత వహించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు కళ్లుమూసుకుని కూర్చోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. గత ఐదు సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ఈ సమస్యను పూర్తిగా విస్మరించారని, ఇప్పుడు కొత్త కౌన్సిలర్ వచ్చినా అదే నిర్లక్ష్యం కొనసాగుతోందని బస్తీవాసులు మండిపడుతున్నారు. సమస్యను పరిష్కరించమని అడిగితే మీ వాళ్లే చెత్త వేస్తున్నారు మీరే చూసుకోండి అంటూ బాధ్యతను ప్రజల మీదకే నెట్టివేయడం మరింత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుండీ పక్కనే ఉన్న డ్రైనేజ్ కాలువ పూర్తిగా మురికిగా మారి దోమల పెంపక కేంద్రంగా మారింది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఇళ్లలోకి చొరబడుతూ, చిన్న పిల్లలు, వృద్ధులు మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులతో బాధపడే పరిస్థితి నెలకొంది. దుర్వాసనతో రోజూ జీవించడం కష్టమైపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఏ కౌన్సిలర్ వచ్చినా ఈ చెత్తకుండీని కదిలించలేకపోతున్నారు. ఐదు సంవత్సరాలు గడిచినా మార్పు లేదు. ఇప్పుడు ఏడాది దగ్గర పడుతున్నా అదే పరిస్థితి. ప్రజల ఆరోగ్యం విలువ లేదా?" అని బస్తీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తక్షణమే స్పందించి ఈ చెత్తకుండీని పూర్తిగా తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే బస్తీవాసులే రోడ్డెక్కి ఆందోళనకు దిగుతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఈ నిర్లక్ష్యాన్ని ఇక సహించబోమని స్పష్టం చేస్తున్నారు.

## దేవాపూర్‌లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

**కెరిమెరి, జూలై 23, ప్రభాతవార్త :**



నిర్దేశిత కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం వాంకిడి సీఐ వేణుగోపాల్ ఎస్సై శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో కలిసి కెరమెరి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారుఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ లో 6 లీటర్ల గుడుంబా (ఐడీ మద్యం) మరియు 200 లీటర్ల బెల్లం ఊట (జగ్గరీ మ్యాష్) స్వాధీనం అయ్యాయి. బెల్లం ఊటను సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఐడీ మద్యం నిషేధ చట్టాల ప్రకారం మూడు కేసులు నమోదు అయినట్లు తెలిపారుఅనంతరం గ్రామస్థులకు అక్రమ కార్యకలాపాల వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, సైబర్ నేరాలపై అవగాహన, ఇతర సంబంధిత అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాము.

# భారత శ్రామిక, కార్మిక లోకానికి బలమైన శక్తి బీఎంఎస్

**- 12వ వేతన కమిటీ నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలు**

**- విద్యుత్తు బొగ్గు బకాయిల సాధనకు ఆందోళనలు ఉధృతం చేస్తాం : బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య**

**- శ్రీరాంపూర్ ఏరియాలో ఘనంగా నిర్వహించిన 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**నస్పూర్, జూలై 23, ప్రభాతవార్త**



జెండా ఆవిష్కరిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, నాయకులు

దశాబ్దాల నిబద్ధత, అకుంఠిత దీక్షతో భారత శ్రామిక, కార్మిక లోకానికి భారతీయ మజ్దూర్ సంఘ్ దేశంలోనే అత్యంత బలమైన శక్తిగా నిలిచిందని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ డిపార్టుమెంట్లు, యూనియన్ కార్యాలయంలో గురువారం బీఎంఎస్ 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ యూనియన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం యాదగిరి సత్తయ్య మాట్లాడారు. జులై 23, 1955న ప్రఖ్యాత జాతీయవాది, కార్మిక నాయకులు దత్తోపంత్ రేంగీ చే బోపాల్ నగరంలో బీఎంఎస్ స్థాపించబడిందని, కార్మికుల హక్కులను పరిరక్షించడం, సంక్షేమాన్ని పెంపొందించడమే దీని ముఖ్య లక్ష్యమని వివరించారు. కార్మికులకు సరైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పించడం కోసం బీఎంఎస్ శ్రమిస్తోందని యాదగిరి సత్తయ్య తెలిపారు. కేవలం నిరసనలు, సమ్మెలు మాత్రమే కాకుండా, యాజమాన్యాలు, కార్మికుల మధ్య సామరస్యాన్ని పెంపొందించడం ద్వారా సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. 11వ వేతన ఒప్పందం విజయం ద్వారా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపామని, ప్రస్తుతం 12వ వేతన కమిటీ నోటిఫికేషన్ విడుదల చేయుటకు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ. 61,149 కోట్లు చెల్లించే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని యాదగిరి సత్తయ్య హెచ్చరించారు. నూతన బొగ్గు గనుల సాధనకు, పరిశ్రమ ప్రగతికి బీఎంఎస్ ముందుండి పోరాడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి, సెక్రటరీ రాజారామ్ కిరణ్ కుమార్, నాయకులు జీడి ప్రభాకర్, రాగం రాజేందర్, అప్పాల బీరయ్య, మంద కమలాకర్, అడిగొప్పుల రాజకుమార్, జెల్ల తిరుపతి, దుంపల శ్రీధర్, చల్లా ప్రశాంత్, మీస దీపక్, మిట్ట మధుకర్, ఐలీ శ్రీనివాస్, బుర్ర అరుణ్ గౌడ్, గూడ శ్రీకాంత్ పాల్గొన్నారు.



## సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**జన్నారం, జూలై 23, ప్రభాతవార్త**

జిల్లాలో సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు, మల్రిగూడ గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులను, దండేపల్లి మండలం లింగాపూర్‌లోని శ్రీ కృష్ణ అగ్రో ఇండస్ట్రీస్, పెద్దపేటలోని భవాని ఇండస్ట్రీస్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పీబీఆర్ఎం, రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయా మండలాల తహసీల్దార్‌లతో కలిసి పరిశీలించి అధికారులతో వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పెండింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెండింగ్ సిఎంఆర్ బియ్యం సంబంధిత పురోగతిని సమీక్షించారు. రైస్ మిల్లులలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, నిర్దేశిత గడువులోగా సిఎంఆర్‌ను పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లుల యాజమాన్యాలకు సూచించారు. అనంతరం జన్నారం, దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని, రికార్డులను అనుసరించి 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూలై 23, ప్రభాతవార్త**

ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 90 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అనామోలీస్ ఎక్కువగా ఉన్నాయని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. నోటీసుల విషయంలో ఓటర్లు కంగారు పడవలసిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. డబుల్, డెత్, షిఫ్ట్ అయినవారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందని, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా బూత్ స్థాయి అధికారులకు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి



### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, జూలై 23, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణనుపరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి మండలంలోని గ్రామపంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వారసంతలో పరిశుభ్రత పరిశీలన
- పీహెచ్‌సీలో మందుల నిల్వలపై ఆరా
- జడ్పీ పాఠశాల తనిఖీ

**చింతలమానేపల్లి, జూలై 23, ప్రభాతవార్త:**

మండలంలోని రవీంద్రనగర్ 1 గ్రామ పంచాయతీలో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మరాట్ (స్థానిక సంస్థలు) గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంత, మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి పరిసరాల పరిశుభ్రతపై అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలపై పీహెచ్‌సీ వైద్యాధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, పీహెచ్‌సీ డాక్టర్ రాజ్ కుమార్, సర్పంచ్ సూరజ్ దాస్, ఉప సర్పంచ్ విష్ణు బిశ్వాస్, పంచాయతీ కార్యదర్శి పెందూరు భాస్కర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ వాహనాల పాత సామగ్రికి ఈ నెల 27న బహిరంగ వేలం


- స్పేర్ పార్ట్స్, టైర్లు, బ్యాటరీలు, వినియోగించిన ఇంజిన్ నూనె విక్రయం
- ఆసక్తి గల వారు పాల్గొనాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపు

**మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాలకు సంబంధించిన పాత సామగ్రిని బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నెల 27వ తేదీన కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ వేలంలో వాహనాలకు సంబంధించిన పాత విడిభాగాలు, టైర్లు, బ్యాటరీలు, వినియోగించిన ఇంజిన్ నూనె తదితర సామగ్రిని విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు, వ్యాపారులు, సంస్థల ప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వేలంలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు. వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వారు ముందుగానే వివరాలు తెలుసుకొని నిర్ణీత సమయంలో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం రవాణా విభాగం అధికారి మల్లేశంను ఈ ఫోన్ నెంబర్‌లో 8712656616 సంప్రదించవచ్చని సూచించారు. ఈ బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు వినియోగానికి పనికివచ్చే పాత సామగ్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఆసిఫాబాద్ టౌన్, జులై 23, ప్రభాతవార్త**



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతయని డీఆర్‌డీఓ దత్తారావు పేర్కొన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఇతర అధికారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా డిఆర్డిఓ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మొక్కఅనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులకు సూచించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ ఆంజనేయులు, ఏపీఓ బుచ్చన్న, గ్రామ సర్పంచ్, ఈసీలు, టీఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిరునవ్వుల ఆరోగ్యానికి చేయూత.. గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఉచిత మెగా దంత వైద్య శిబిరం

- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు దంత పరీక్షలు - నోటి పరిశుభ్రతపై వైద్యుల అవగాహన

**మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త**

మందమర్రి మండలం తిమ్మాపూర్‌లోని గ్రీన్‌వుడ్ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు, పరిపాలన విభాగం ప్రతినిధి పవన్ కుమార్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన శ్రీకాంత్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. దంతాల సంరక్షణ, నోటి పరిశుభ్రత, దంత క్షయం నివారణ, సరైన పద్ధతిలో పళ్ల తోముకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై విలువైన సూచనలు అందించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వారు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఉచిత వైద్య సేవలు అందించిన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయురాలు క్రిస్టినా, ఉప ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, పరిపాలన అధికారి ఖుద్దూస్, వైద్యులు శ్రీకాంత్, సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.






మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

## ఇంటింటికి 6 మొక్కలు నాటాలి

**బెజ్జూర్, జూలై 23, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలోని కుంటల మానేపల్లి గ్రామంలో గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడిఓ బిఎస్ ప్రవీణ్ కుమార్ ఇంటింటికి 6 మొక్కల పంపిణీని స్థానిక సర్పంచుతో కలిసి ప్రారంభించారు. పండ్ల మొక్కలు, ములక్కాయ మొక్కలు పంపిణి చేసినట్లు తెలిపారు. పంపిణి చేసిన మొక్కలను నాటుకొని సంరక్షించుకోవాలని తద్వారా వాటి ఫలాలు పొందాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గావిడే స్నేహ, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన

**తాండూర్, జులై 23, ప్రభాతవార్త**



మండలంలోని రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల లోపు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపిస్తే క్రమశిక్షణతో పాటు బాలామృతం వంటి పోషకాహార ఆహారం అందడం వల్ల పిల్లల ఎదుగుదల మెరుగుపడి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారుఅనంతరం గుడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, వార్డు సభ్యులు తాటిపాముల రాంప్రసాద్, లింగంపల్లి అభిలాష, ఎల్దండి కవిత, రౌతు భారతి, చెప్యాల నిరంజన్ రావు, పంచాయతీ సెక్రెటరీరామదేవి, అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జులై 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్: విద్యార్థి సంఘాల పిలుపు

### కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్న నాయకులు

భైంసా, జులై 23, ప్రభాతవార్త:



విద్యా రంగాన్ని ప్రైవేటీకరిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జులై 24న నిర్వహించతలపెట్టిన రాష్ట్రవ్యాప్త "విద్యా సంస్థల బంద్"ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు భైంసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బంద్ ముందస్తు ప్రచార పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో తీవ్రమైన అవకతవకలు, పేపర్ లీకేజీలు జరిగి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు అయోమయంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఏ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన దాడి ఘటనలపై పారదర్శక విచారణ జరిపించాలని, విద్యా కేంద్రీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని, వీబీశా బిల్లును రద్దు చేయాలని కోరారు. శుక్రవారం (జులై 24న) జరిగే బంద్‌లో ఇంటర్మీడియట్ నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను మూసివేసి విద్యార్థులు, యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ స్టూడెంట్ యూనియన్ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి అంజాద్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## జలసిరి కోసం ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత

### - ఎంపీడీవో లక్ష్మీకాంత్‌వర్షపు బొట్టు ఒడిసిపట్టడమే లక్ష్యంగా ప్రచారం

సారంగాపూర్, జులై 23, ప్రభాతవార్త:

మండలంలోని గోపాల్‌పేట్, స్వర్ణ, బీరవెల్లి, రామ్‌సింగ్ తండా గ్రామాల్లో వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ గ్రామీణ పథకం కింద "వర్షపు బొట్టు ఒడిసిపట్టు" నినాదంతో నీటి సంరక్షణ పనులను ఎంపీడీవో లక్ష్మీ మ్రకాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. వ్యవసాయ బావుల పరిసరాల్లోనూ నీటిని ఇంకించేలా గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పలు గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగారెడ్డి, మల్లేష్, రజిత, గంగమణి, ఏపీఎం మాధురి, ఏపీఓ మంజుల, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దశలవారీగా గ్రామాల అభివృద్ధి ధ్యేయం: ఎమ్మెల్యే

### - దేగాం, బిజ్జూర్, లింగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

భైంసా, జులై 23, ప్రభాతవార్త:

దశలవారీగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన ఏకైక ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడను, బిజ్జూర్, లింగా గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున వెచ్చించి నిర్మించిన మహిళా సమైక్య భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో, ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, గోదాములు, మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి ప్రతి గ్రామానికి రూ.50 లక్షల నుండి రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేశామని వివరించారు. గత పదేళ్ల పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో తీవ్రంగా వెనుకబడిందని, ఆ పరిస్థితిని మార్చి గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రారంభోత్సవాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల మహిళలు, ప్రజలు పూలు చల్లుతూ, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు.

**విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే:** దేగాం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే రామారావు పటేల్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, పాఠశాలలోని పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**లింగా గ్రామంలో జలసిరి ప్రారంభం:** లింగా గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి కుంట నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ వికసిత్ భారత్ రోజ్‌గార్ పథకంలో నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టి నీటిని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో నీరజ్ కుమార్, సీనియర్ నాయకులు సోలంకి భీమ్రావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పండిత్ రావు పటేల్, దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి, సర్పంచులు లక్ష్మీ వెంకట్ రెడ్డి, గడపాలే సుష్మా రాణి యశ్వంత్, బీజేపీ నాయకులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## కాళేశ్వరంపై కేంద్ర స్థాయిలో సమీక్ష.. రైతుల ప్రయోజనాలే ప్రధాన అజెండా

### - నాణ్యత, అవినీతి ఆరోపణలు, సాగునీరు-త్రాగునీరు-విద్యుత్ అంశాలపై ఢిల్లీలో కీలక సమావేశం.. పాల్గొన్న రాష్ట్ర బిజెపి నాయకులు

మంచిర్యాల, జులై 23, ప్రభాతవార్త



న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత, అవినీతి ఆరోపణలు, తెలంగాణ రైతులకు సాగునీరు, త్రాగునీటి సరఫరా, విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలపై రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొని ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అలాగే ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అరవింద్, గోడం నగేష్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్ బాబు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, శాసన మండలి సభ్యుడు, అంజి రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర చర్యలు చేపట్టాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



## దేశాన్ని అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ కుట్ర

### - రావుల రాంనాథ్‌నీట్ ముసుగులో విపక్షాల రాజకీయం

నిర్మల్, జులై 23, ప్రభాతవార్త:

దేశాన్ని అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని బీజేపీ నేత రావుల రాంనాథ్ ఆరోపించారు. నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. నీట్‌ను అడ్డుపెట్టుకుని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నాయని అన్నారు. ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్నారని, సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్‌కు, నీట్ పరీక్షలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఇది మోదీ భారత్ అని, ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల కుట్రలకు బీజేపీ భయపడదని స్పష్టం చేశారు. మోదీని బలహీనపరచాలనే పగటి కలలు కనడం రాహుల్ గాంధీ మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్. అరవింద్, గంజి రాజు, ధర్మాజీగారి ఈశ్వర్, విఠల్, సూరజ్, సీనియర్ నాయకులు పోడెల్లి గణేష్, జాప ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సిపిఎస్ యాత్రను జయప్రదం చేయండి

### టిఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్ - సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించడమే ఏకైక లక్ష్యం

సారంగాపూర్, జులై 23, ప్రభాతవార్త:

సిపిఎస్ జన జాతర యాత్రను జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని టిఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ యాత్రను తలపెట్టినట్లు తెలిపారు. ఈ సంకల్ప సాధన కోసం ఉపాధ్యాయులందరూ స్వచ్ఛందంగా పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు నర్సయ్య, భీమేష్, లక్ష్మణ్, చిన్నయ్య పాల్గొన్నారు.



# సీపీఎస్ రద్దు కోసం జన జాగరణ యాత్రను విజయవంతం చేయండి

**- టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి పిలుపు**

**- కాగజ్‌నగర్‌లో నేడు బైక్ ర్యాలీ - ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు**

కాగజ్‌నగర్ రూరల్,జూలై 23, ప్రభాతవార్త :

సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం) రద్దు చేయాలనే ఏకైక లక్ష్యంతో తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జన జాగరణ యాత్ర విజయవంతంగా కొనసాగుతోందని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో నిర్వహిస్తున్న ఈ జన జాగరణ యాత్ర ఈ నెల 11వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్ర ఈ నెల 24వ తేదీన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు కాగజ్‌నగర్ నూతన బస్‌స్టాండ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలకు వెళ్లి సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన జాగరణ యాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి పిలుపునిచ్చారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.



జన జాగరణ యాత్రను పోస్టర్ విడుదల చేస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ సంఘం నాయకులు



## రాహుల్ గాంధీ అరెస్ట్‌కు నిరసనగా భైంసాలో కాంగ్రెస్ ధర్నా

**- విద్యార్థుల కోసం పోరాడుతుంటే అక్రమ అరెస్టులా: కాంగ్రెస్ శ్రేణుల మండిపాటు**

భైంసా, జులై 23, ప్రభాతవార్త:

నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై అభ్యర్థులకు మద్దతుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీల అరెస్ట్‌ను నిరసిస్తూ భైంసా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిలదీస్తున్నందుకే రాహుల్ గాంధీపై అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇది కేవలం కక్షసాధింపు చర్యేనని తీవ్రంగా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా కేంద్రం కాలరాస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు, కేంద్ర ప్రభుత్వ అణచివేత ధోరణి నశించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**- మృతి చెందిన రైతు నారాయణ రెడ్డి కుటుంబానికి నాయకుల పరామర్శ**

సారంగాపూర్, జులై 23, ప్రభాతవార్త:

మండలంలోని ప్యారామూరు గ్రామానికి చెందిన రైతు మోకు నారాయణ రెడ్డి గత శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గురువారం ప్యారామూరు గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను నేరుగా కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కౌట్ల పీఏసీఎస్ ఛైర్మన్ అయిర నారాయణ రెడ్డి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ కోశాధికారి దశరథ్ రాజేశ్వర్ బాధిత కుటుంబాన్ని ఓదార్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్యారామూరు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు మిర్ద సాయన్న, స్థానికులు పాల్గొన్నారు.

## వర్షాలకు ఇల్లు దెబ్బతిన్న బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంది

ఆసిఫాబాద్, జూలై 23, ప్రభాతవార్త :

గత రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాల కారణంగా ఆసిఫాబాద్ పట్టణంలోని మేకలవాడకు చెందిన జూలాల లక్షి ్మ అనే నిరుపేద మహిళ ఇంటి గోడలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జేబ షేక్ సమాచారం మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ గురువారం ఘటనాస్థలికి చేరుకుని దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాధితురాలిని పరామర్శించి ధైర్యం చెప్పారు. వర్షాల వల్ల నష్టపోయిన ఆమెకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అర్హత మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బీన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకుడు సమద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


కూలిన ఇంటి గోడలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్



## బెల్లంపల్లిలో బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఆహార విషాధ ఘటన విద్యార్థినులకు వైద్యం, అధికారులు అప్రమత్తం

బెల్లంపల్లి, జూలై 23, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో ఆహార విషబాధకు సంబంధించిన ఘటన కలకలం రేపింది. బుధవారం రాత్రి 15 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించబడ్డారు. వారికి తక్షణమే వైద్యం అందించగా, ఈరోజు ఉదయం ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. అయితే ఈరోజు ఉదయం మరో 8 మంది విద్యార్థినులు ఇదే లక్షణాలతో ఆసుపత్రికి రావడం జరిగింది. వారిలో 7 మందిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అన్ని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, బెల్లంపల్లి జనరల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవి, డాక్టర్ అరుణ్ కలిసి రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వంటగదులు, తాగునీటి వనరులను పరిశీలించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వాసు రామ్, జిల్లా సర్విలియన్స్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఎపిడెమియాలజిస్ట్ సుమన్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు, నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. అదేవిధంగా, ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్యాధికారి డాక్టర్ సుచరిత ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మిగతా విద్యార్థినులకు కూడా నిరంతర వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థినులకు శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగడం, వేడి ఆహారాన్ని తీసుకోవడం వంటి సూచనలు ఇచ్చారు. అలాగే వంటగదుల పరిశుభ్రత, వంట పాత్రల శుభ్రత, వంట సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌సీఓ శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

**- ప్రత్యేక సమగ్ర సవరణలో బీజేపీ నేతల క్షేత్ర పర్యటన**



నిర్మల్, జులై 23, ప్రభాతవార్త:

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిర్ణీత గడువులోగా ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి అధికారులను బీజేపీ నేతలు కోరారు. భారతీయ జనతా పార్టీ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను అసెంబ్లీ స్థాయి బూత్ స్థాయి ఏజెంట్1 సమన్వయకర్త మెడిసమ్మె రాజు, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన కొత్త ఓటర్లు ఎవరూ జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని, అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాను దోషరహితంగా రూపొందించేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. శ్రీనివాస్, పోలాస భరత్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీరామోజు నరేష్, శశాంక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గిల్లి విజయ్, ఉపాధ్యక్షుడు ముప్పిడి రాకేష్, నాని, మణికంఠ పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**- ఆగస్టు 2న మహాసభలు నిర్వహణకు పిలుపు**




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ఏఐటీయూసీ తాండూర్ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు కొండు బానేష్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి మేకల దాసు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ దేశంలో ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘమైన ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలన కాలం నుంచే కార్మికులను ఐక్యపరిచి వారి హక్కుల కోసం రాజీ లేని పోరాటాలు సాగిస్తోందన్నారు. కనీస వేతన చట్టం, సంఘం ఏర్పాటు హక్కు, సమ్మె హక్కు వంటి అనేక హక్కులు ఏఐటీయూసీ పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికులను దోపిడీ చేస్తూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. అంగన్వాడి, ఏఎన్ఎం, ఆశా, ఆర్టీసీ, మధ్యాహ్న భోజనం, 108, 104 సిబ్బంది, హాస్పిటల్ కార్మికులు, హమాలీలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, లారీ డ్రైవర్లు, పెయింటింగ్, సెంట్రింగ్, మార్బుల్ తదితర రంగాల్లో పనిచేసే కార్మికులు ఉపాధి సమస్యలు, తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఆగస్టు 2న జరిగే ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాండూర్ మండల కన్వీనర్‌గా తాని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భయ్యా మొగిలి (గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు), సాలీగామ సంతోష్, వాసాల నాగరాజు, పట్టి శంకర్, దాసరి లక్ష్మి, కొండు సాయికుమార్, కుర్సింగ తిరుపతి, మీసాల సన్యాసి, గాజుల దేవయ్య, ముత్తె శంకర్, పెద్ద బోయిన చందు, ఉట్నూరి అంకేష్, పెద్ద బోయిన లక్ష్మణ్, పెద్ద బోయిన మహేందర్, మంచర్ల వెంకటేష్, ధర్మరాజుల అభిరామ్, పెద్ద బోయిన మనోహర్, ఎలిగేటి భీమేష్, కమ్మరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలి

**- రాష్ట్ర పరిశీలకులు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి**



**భైంసా, జులై 23, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని శ్రీ బ్యాంక్వెట్ హాల్‌లో సిర్పాయి బీఎల్ సమావేశం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, రాష్ట్ర పరిశీలకులు ఆరేపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ్ రావు పటేల్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తహేర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహణ

**- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం**



**బెల్లంపల్లి, జూలై 23, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచనలు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మార్గదర్శకత్వంలో, పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 34 వార్డులకు సంబంధించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి ఫోన్ ద్వారా మాట్లాడుతూ ప్రతి ఓటరితో ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపించి, పాత ఓటరు వివరాలు లేదా 2002 ఓటరు జాబితా ఆధారంగా వివరాలను నవీకరించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణంలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేయాలని అధికారులకు, బిఎల్ఓ లు, బిఎల్ఏ లకు ఆదేశించారు. ఇప్పటివరకు బెల్లంపల్లి నియోజకవర్గంలో 90 నుండి 100 శాతం వరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొంటూ, ఈ కార్యక్రమంలో శ్రమించిన పార్టీ నాయకులు, బిఎల్వో లు, బిఎల్ఏ లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ కాశీపాక రాజేష్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఫారం6, 7, 8 వినియోగం, ఓటర్ల ధ్రువీకరణ, అభ్యంతరాల నమోదు, సెల్ఫ్ మరియు ప్రాక్సీ మ్యాపింగ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐ ఓటర్లు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా బిఎల్ఏ లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, సవరణలు, చిరునామా మార్పులు వంటి అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, జిల్లా జనరల్ సెక్రటరీ రొడ్డ శారద, మాజీ కౌన్సిలర్ దామెర శ్రీనివాస్, దేవసాని ఆనంద్ తదితరులు మాట్లాడుతూ ప్రతి ఓటరును ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, నెల్లి రమేష్, దుబాసి వెంకటస్వామి, గాలి శ్రీనివాస్ యాదవ్, పరమేష్, కాంపెల్లి శ్రీనివాస్, ఇబ్రహీం, గద్దల కుమార్, ఎం.ఏ ఖలీల్, తులసి, బూత్ ఇన్చార్జీలు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.



## నీట్ లీకేజీకి కేంద్ర మంత్రి బాధ్యత వహించాలి

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**- కూచాడి శ్రీహరి రావు డిమాండ్**

**నిర్మల్, జులై 23, ప్రభాతవార్త:**

నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తి బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూచాడి శ్రీహరి రావు డిమాండ్ చేశారు. గురువారం దిలావర్‌పూర్, సారంగాపూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ అక్రమాలపై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు మద్దతుగా ధర్నా చేసిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అణచివేసే ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటే నీట్ లీకేజీ వ్యవహారంపై పారదర్శక దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేసే వరకు ఆందోళన ఆగదు

**బెజ్జూర్, జూలై 23, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ పేపర్ లీగ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని వెంటనే ఈ విధానాలకు బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ దండే విటల్ అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్మన్ గణపతి, జిల్లా ఉపాధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్, సర్పంచులు రాంప్రసాద్, సోయం చిన్నయ్య, మల్లేష్, శ్రీహరి, చిరంజీవి శంకర్, నాయకులు శ్రీ వర్ధన్, విశ్వేశ్వర్, పెంటయ్య, నాహీర్ అలీ పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు